# అబ్బే... ఏంలేదు ....!

రచన : శంకరమంచి పార్థసారథి

| ఇందలి పాత్రలు | | పాత్రధారులు |
|---|---|---|
| 1. | శంకర్రావు | రవిశంకర్ |
| 2. | సత్తిబాబు | శివన్నారాయణ |
| 3. | గంగరాజు | విశ్వమోహన్ |
| 4. | రాణి | శ్రీవాణి |
| 5. | వాసు | జెన్ని |
| 6. | రాంబ్రహ్మం | భగవాన్‌జా |

# అచ్చే... ఏంలేదు ....!

( రచన : శంకరమంచి పార్థసారథి )

( అది ఒక మధ్య తరగతి డ్రాయింగ్ రూం సోఫాలో కూర్చుని పేపర్ తిరగేస్తున్న శంకర్రావు చటుక్కున గుర్తుకు వచ్చి టైం చూసుకుని కంగారుగా భార్యని పిలుస్తున్నాడు )

శంక : రాణీ ! త్వరగా రెడీ అవ్వాలి అప్పుడే తొమ్మిది దాటింది ఏమిటి వినిపించిందా !

( రాణీ మరో గదిలోంచి అక్కడికి వచ్చింది. పోగొట్టుకున్న దాని గురించి సోఫాల్లో, వాటి క్రింద వెదుకుతుంది కాని శంకర్రావు ఆమె రాకని గమనించక అదే ఫోర్సుతో గదివైపు చూస్తూ అంటున్నాడు )

శంక : ఏమోయ్, నిన్నే ఏం చేస్తున్నావ్. ఆలస్యం చేసావంటే ట్రయిన్ మిస్సయి పోతావ్ వరంగల్ అక్కయ్య ఇంటికి వెళ్ళలేవు, ఫంక్షన్‌కి వెళ్ళకపోతే మీ అక్క ఫీలవుతుంది వినిపించిందా !

రాణి : నాకు చెవుడేం లేదు కాని, కాస్త పక్కకి తప్పుకోండి...

శంక : ఏమిటి నువ్వు ఇక్కడే వున్నావా ! అవునూ ఏమిటి వెతుకుతున్నావ్ ! ఏం పోయింది?

రాణి : స్నానానికి వెడుతూ నా వుంగరం లోపల టి.వి.మీద పెట్టాను. కనిపించటంలా...

శంక : టి.వి మీద పెట్టి ఇక్కడ వెతుకుతుంటే ఎలా కనిపిస్తుందోయ్ అక్కడే వుంటుంది.

రాణి : అబ్బో ఆ మాత్రం నాకు తెల్సులెండి అక్కడ కనిపించలేదు కాబట్టే ఈ వెతకటం మీరేవన్నా తీసారా ?

శంక : నేనా ! నే చూడలేదే ? అయినా టి.వి. మీద పెట్టిన వుంగరం ఏమవుతుందబ్బా, అన్నట్టు వాడిని అడిగి చూసావా ?

రాణి : ఎవర్ని ! సత్తి బాబునా ?

శంక : ఆ ! ఆ వాడినే. ఎంత పుట్టింటి తరుపునుంచి వచ్చిన వంట వాడయినా అంత అభిమానించటం, గుడ్డిగా ఆ చెవిటి వెదవని నమ్మటం మంచిది కాదని మళ్ళీ చెప్తున్నా !

రాణి : మళ్ళీ మొదలెట్టారు ఏవండి ! నాకు తెలియకడుగుతాను వాడి మీద మీకెందుకండి అంత కోపం  సత్తిగాడు చిన్నతనం నించి నాకు తెల్సండి !  అసలు మా ఇంట్లోనే పుట్టాడు తెల్సా

శంక : అదేమిటో రాణి  ! ఈ మధ్య వాడిని చూడగా చూడగా  మీ నాన్న పోలికలు కనిపిస్తున్నాయి ఎంచేతంటావ్ ?

రాణి : చాల్లెండి పిచ్చి మాటలు మీరూనూ వాడు నా కళ్ళముందే పుట్టి పెరిగాడు నిప్పులాంటి వాడు పదిపైసలు కావాలన్నా అడిగి తీసుకుంటాడు గానీ, కొట్టెయ్యటాలు కాజెయ్యటాలు అస్సలు తెలీవు.

(సత్తి బాబు దుప్పటి కప్పుకుని మూలుగుతూ అక్కడికి వచ్చాడు )

సత్తి : ఏంటక్కా ! ఇంకా వెళ్ళలేదా ? పెద్దక్క నీ గురించి ఎదురు చూస్తుంటుంది. త్వరగా బయల్దేరు.

శంక : బయల్దేరుతుంది గానీ ...ఏమిటి దుప్పటి కప్పావు ! పశువుల కాపరిలాగా ఏమిటి సంగతి ?

రాణి : జ్వరమండి ! వళ్ళు కాలిపోతుంది.

సత్తి : అవునండి ! నీళ్ళు మరిగిపోతున్నాయి స్నానం చేస్తారా ? కాసేపుంటారా ?

శంక : ఇదో గోల ! వెధవకి బ్రహ్మ చెవుడు పైగా చెవుడు అని చెప్పుకోటానికి  నా మర్దా సన్నాసి వెధవకి ....

...మీ అక్కయ్యది ...రింగు ..రింగురా ...వుంగరం

రాణి : నే అడిగాను.. మీరు వుత్తినే హైరాణ పడకండి.

సత్తి : అక్క వుంగరం  గురించా ! నే చూడలేదు బావా ! ఒట్టు అక్కకి చెప్పాగా !

శంక : చెప్తావురా ! చెప్తావు ! వెధవ దొంగ ఫేసు  నువ్వున్నూ రేయ్ ! ఎదో ఒక రోజు  నీ అసలు  రంగు మీ అక్కకి తెల్సేలా  చేసి దాని  చేతి ఛీ కొట్టించకపోతే  నా పేరు మార్చుకుంటా.....

సత్తి : సరేనండి ! ఇప్పుడే మార్చుకుంటారా, అక్క వెళ్ళాక మార్చుకుంటారా  ?

శంక : ( కసితో ) నే చచ్చాక మార్చుకుంటా ?

సత్తి : సరే నీ యిష్టం  అలాగే  నాదేం వుంది ! అక్క నువ్ బయల్దేరు  బావకి ఏ లోటు లేకుండా  నే చూసుకుంటాగా

శంక : రాస్కెల్ ! బావా గీవా అన్నావంటే ...నిన్నూ ...నిన్నూ...

రాణి : మీరెంత గొంతు చించుకున్నా ఏం లాభం లేదు... ఏవండి ! వుంగరం లేకపోతే వేలు చూడండి ఎంత బోసి పోతుందో.

శంక : దాని గురించి బాధపడకు నువు తిరిగొచ్చేసరికి ఆ వుంగరం వెతికి పట్టుకుని, బోసి పోతున్న నీ వేలుకి తొడిగి, భర్తగా నా భాద్యత నెరవేర్చుకుంటాగా. నువ్వు బయల్దేరు.

రాణి : అలాగే ! మరి ఆ వుంగరం బుద్దిగా నాకిచ్చెయ్యండి.

శంక : వుంగరమా ! నాకు తెలీదు. నే తీయలేదు రాణి ...ఒట్టు ఓహో, అంటే ఆ వుంగరాన్ని నేనే దాచి...నువ్ వచ్చాక సత్తిబాబు గాడు తీసాడు దొంగవెధవని చెప్తాననా నీ అనుమానం.

రాణి : చెప్పినా నే నమ్మను..అంచేత అటువంటి ప్రయత్నాలు చెయ్యకండి.

శంక : సరేలే ... ఇంతకి ఈ ప్రయాణం వుందా లేదా !

రాణి : నే వెళ్ళనండి... వాడికేమో జ్వరం అంటున్నాడు. వుంగరం కాస్తా పోయింది. మీరేమో ఎప్పుడూ లేనిది వెళ్ళు వెళ్ళు అని తొందర పడుతున్నారు. అన్నీ అపశకులనాలుగా వున్నాయి. అంచేత వెళ్ళాలనిపించటం లేదు. ....వెళ్ళను

శంక : సరే...నీ ఇష్టం అయినా వంట వాడికి జ్వరం అని ప్రయాణాలు మానుకోవటం మంచి పద్దతి కాదు.

(సత్తిబాబు అక్కడికి వచ్చాడు. వాడి చేతిలో సూటుకేసుంది. )

సత్తి : ఇంట్లో వంకాయలున్నాయండి ! ...నాకు పెరుగు, వురగాయ చాలు.

రాణి : జ్వరంతో అన్నం తింటే వాతం కమ్ముతుంది బ్రెడ్డు తెచ్చుకుని తిని, పాలు తాగి.

సత్తి : అలాగే అక్కా !

శంక : నేను అసెంబ్లీలో అపోజిషన్ లాగా అరిచినా వినిపించదు నువు మెల్లిగా చెప్పినా వినిపిస్తుంది. అంతా మాయగా వుంది ఫోనెవరకి !

రాణి : డాక్టర్‌కి ( నంబర్ డయల్ చేస్తుంది )

శంక : డాక్టరా ! అంటే నా ఆరోగ్యం గురించి డౌటా !

రాణి : ( ఫోన్లో ) డాక్టర్ శివరావు గారా ? నమస్కారం డాక్టర్, నే రాణిని మాట్లాడుతున్నాను ....మీ మిస్సెస్ ఫ్రెండ్‌ని పది రోజులు క్రితం మీరు, జ్యోతి మా యింటికి వచ్చారు. గుర్తొచ్చానా ? జ్యోతి బయిటికి వెళ్లిందా ! నే ఫోను చేస్తున్నది మీతో మాట్లాడాలని నేను వరంగల్ వెళుతున్నా డాక్టర్. మా వంట కుర్రాడికి జ్వరం బాగా వుంది. నడవలేని స్థితిలో వున్నాడు. ప్రయాణం లేకపోతే నేనే తీసుకువచ్చేదాన్ని. వారికేమో మీ ఇల్లు తెలీదూ థాంక్యూ డాక్టర్ ! అలాగే ...సారీ ట్రబులిస్తున్నా జ్యోతి వచ్చాక మీరు మా యింటికి రావాలి. మావార్ని మీకు పరిచయం చేస్తా...అలాగే వుంటానండి ! థాంక్యూ

( ఫోన్ పెట్టేస్తుంది )

శంక : దీన్నే టూ మచ్ అంటారు. డాక్టర్ ఎంత మీ ఫ్రెండ్ మొగుడయినా వంటవాడికి ట్రీట్ చెయ్యడానికి స్వయంగా రావాలా !

రాణి : ( సత్తిబాబుతో ) డాక్టర్‌గారు వస్తానన్నారు. మెడిసిన్ వ్రాసిస్తారు తెచ్చి వేసుకో ! ఎండలో వెళ్ళలేక పోతే మొగమాట పడక బావకి చెప్పి టాబెలెట్లు.

శంక : తెచ్చి గొంతులో వేసి నీళ్ళు పోస్తా....
నీ మొహంమండ దీన్నే రాజ యోగం అంటారు. సుఖపడేయోగం వుంటే ఇలాంటి అక్కలు, వాళ్ళకి నాలాంటి మొగుళ్ళు వుంటారు.

సత్తి : నా చెవుడు గురించి పదే పదే వుపన్యాసాలు ఇవ్వకండి అసలు నాకు చెవుడు లేదండి కావాలంటే అక్కని అడడండి.

రాణి : సరేలే... చూడు నేను వీలైతే రాత్రికి వచ్చేస్తా.... లేదూ రేపు వుదయానికల్లా వస్తా... ఇల్లు జాగ్రత్త డాక్టర్ గారికి అన్ని దాచకుండా చెప్పి.... రాగానే కూర్చోమని టీ ఇవ్వు సరేనా.

సత్తి : అలాగే అక్కా...పెద్దక్కని, బావని అడిగానని చెప్పు...

శంక : అలాగే...అక్కని ఆటో ఎక్కించి వస్తాగాని కొంప జాగ్రత్త రాణీ ! పదా...వూ
( శంకర్రావు, రాణీలు బయటికి వెళ్ళారు సత్తి వాళ్ళని వెళ్ళనిచ్చాక కాసేపు గమనించి తర్వాత పెద్ద రిలీఫ్ )

సత్తి : ఈ ఫోన్లొకటి పనిలేని వెధవలంతా బావకి చేస్తుంటారు. ( వెళ్ళి ఫోన్ తీసి... హల్లో ఎవడండి ! రాంగ్ నంబరండి ! ...రాంగ్ నంబర్ ఫోన్ పెట్టేసి వెనక్కి తిరిగాడు ఇప్పుడు నిజంగానే మోగింది కాని సత్తి బాబు పట్టించుకోనట్టు కూర్చున్నాడు )

( శంకర్రావు వచ్చాడు. మ్రోగుతున్న ఫోన్ని, పట్టించుకోని సత్తిబాబుని చూసాడు విసుకున్నాడు )

శంక : ఫోన్ రింగవుతున్నా ఎలా నిల్చున్నాడో బుద్ధ విగ్రహంలాగా పైగా చెవుడు లేదని బుకాయింపు....

హల్లో ...ఎవరండీ ! గంగరాజు గారు కావాలా . నేను శంకర్రావుని. వారి దగ్గర అసిస్టెంటుగా పని చేస్తుంటా ఇది నా ఇల్లేనండి గంగరాజు గారు ఈ నెంబరిచ్చారా ఇంకా రాలేదు మరి, వస్తారేమో మీరోస్తున్నారని చెప్పమంటారా ! అలానే వుంటానండి ! ( ఫోన్ పెట్టేసాడు ) సత్తిబాబు సోఫా తుడుస్తున్నట్లు నటిస్తూ క్రిందపడ్డ ఉల్లిపాయల్ని ప్రక్కకి తన్నే ప్రయత్నాలు చేస్తున్నాడు ) ఎలా చూస్తున్నాడో దొంగమోహం వాడూనూ వీడు పూర్వ జన్మలో నా భార్యేమో అని అనుమానం అకౌంట్ సెటిలు కాక ఇలా చంపుకు తింటున్నాడు. ఏరా ... జ్వరం అన్నావుగా ...వెళ్ళి పడుకుని చావు మోహం వంక చూస్తూ ఎంత సేపు నిల్చుంటావు.... ఇంట్లో కూరలు ఏం వున్నాయో ఏమో...

సత్తి : వంకాయలున్నాయి చెప్పా కదా బావా ! ఇంకేవన్నా కావాలంటే చెప్పు వెళ్లి తెస్తా ....

శంక : చిత్రంగా వుందే, మొట్టమొదటిసారిగా నాలోనే అనుకున్న మాట వాడికి వినిపించింది అంటే వీడికి వినిపించాలంటే ఈ రేంజ్లో, ఈ వాల్యూమ్లో అనాలన్నా మాట, రేయ్ ఇలారా !

సత్తి : ఎంటి బావా ! వుంగరం సంగతి నాకు తెలీదు బావా ! దేవుడు పైన వట్టుబావా

శంక : ( పెద్దగా అన్నాడు ) ఇంట్లో ఏ కూరలున్నాయి ! వినిపించిందా ?

( లేదని తలూపాడు )

( కొద్దిగా తగ్గించి )

ఇంట్లో ఏం కూరలున్నాయి.....వినిపించిందా ?

( లేదని తలూపాడు )

సత్తి : అలాగే బావా ! రాత్రి అక్క యిచ్చిన డబ్బులున్నాయిగా, సరిపోతాయి ఈలోపు మీరు
స్నానం చెయ్యండి.
( బయిటికి వెళ్ళిపోయాడు )
శంక : ఇలా నెమ్మదిగా మాట్లాడితే వినబడొచ్చు. వినిపించకపోవచ్చు . ఫిఫ్టీ...ఫిఫ్టీ....
చాన్సెస్ ! అవునూ వీడు ఎక్కడికి వెళ్ళినట్లు
( అంతలో ఆఫీసర్ గంగరాజు హడావుడిగా ప్రవేశిస్తూ )
గంగ : శంకర్రావు ! నిన్నేనయ్యా...
హమ్మయ్య ఇక్కడే వున్నావు గదా ! నాగురించి ఫోన్ కాల్సేవన్నా వచ్చాయా ?
శంక : ఇపుడే ఒక ఫోన్ వచ్చింది సార్ .... పేరు చెప్పలేదు...
గంగ : రాజబాబని నా క్లాస్‌మేట్ మనకి బాగా కావాల్సిన వాడు. కలర్ ఫుల్ పర్సనాలిటీ.
ఏం చెప్పాడు.
శంక : ఇక్కడికి వస్తున్నాని చెప్పమన్నాడు.
గంగ : అన్నాడా ! ఆహా ! ఇదిగో శంకర్రావు ఇవ్వాళ మనం స్పెషల్ ప్రోగ్రామ్
పెట్టుకుంటున్నాం అంచేత నీ వైఫ్‌ని రాత్రి దాకా మా యింటికి పంపించాలి.
శంక : కానీ..సార్...
గంగ : నీకేం భయంలేదు...నే మేనేజ్ చేస్తాగా... అమ్మాయ్ చెల్లెమ్మా...ఏం చేస్తున్నావ్ చిట్టి
తల్లీ...
శంక : సార్ ...నా వైఫ్ ఇంట్లో లేద్సార్...ఇపుడే వరంగల్ వెళ్ళింది...
గంగం : ఆ వూరెళ్ళిందా ? ఎంత మంచి కబురు చెప్పావయ్యా అయితే ఇంక అడ్డం
ఏముంది ? ఎంజాయ్ ది లైఫ్ మై డియర్ బాయ్... సరే రాజబాబు
విషయంలోకి వచ్చేసరికి మనం రెడీ చెయ్యాలి...ఓకే.....అంచేత నువ్
మార్కెట్టుకెళ్ళి కాయకూరలు, పూలు, పళ్ళు గుడ్లు తీసుకురా నేనీలోపు రైస్ కడిగి
కుక్కర్లో పడేస్తా... త్వరగా వెళ్ళు......ఏమిటా చూపులు.
శంక : సార్ ! పళ్ళు, పూలు అంటున్నారు. ఏదైనా వ్రతం చేసుకుంటున్నామా ?

గంగ : శంకర్రావు ! హానెస్టుగా చెప్తున్నా గాదా నువ్వింత స్లో మొగాడివని నే కల్లో కూడా అనుకోలేదయ్యా భార్య వూరెళ్ళింది. సబార్డినేట్స్ కూడా మనుషులే , వాళ్ళల్లో నిద్రాణమై వున్న శక్తుల్ని బయిటికి రప్పించే బాధ్యత ఆఫీసర్‌గా నాకుంది అవి నమ్మి నీకు అవకాశం ఇస్తుంటే ఎంటా సార్ ? వ్రతమా, పూజా అంటుంటే ఏం చెప్పను ఏం చెయ్యనూ...

శంక : సారీ సార్ మీరింత అడ్వాన్స్ పోస్ట్ అని అనుకోక కాస్త సందేహించా, ఇపుడర్ధమయింది....కాని సార్ కాలేజీ రోజుల్లో నే కూడా....

గంగ : ఆ ! ఆహా అలాగా. మరి ఏం తెలీనట్లు ఆ ఫోజెందుకు త్వరగా వెళ్ళి సామాన్లు పట్టుకురా. రాజబాబు విషయంతో వచ్చేసరికి – మనం రెడీగా వుండాలి.

శంక : కాని చిన్న ప్రాబ్లమ్ వుందిసార్ మా వంటమనిషి సత్తిబాబని చెవిటి వెధవ వాడికా రాత్రి నుండి జ్వరం సార్... నా వైఫ్ డాక్టర్ని రమ్మని ఫోన్ కూడా చేసింది ఏ క్షణంలోనైనా ఆయన రావచ్చు....

గంగ : రానియ్యి చూస్తాడు, మందులు వ్రాసిస్తాడు.. జ్వరం మాత్రలని రెండు నిద్రమాత్రలు తగిలించాం అనుకో రాత్రి దాకా ఏమంటాడు అంటే...

శంక : అలా అంటారా కాని... మీరు మా ఆఫీసరయి వుండి ఇలా మా ఇంట్లో వంట చెయ్యడం ఎవరాన్న చూస్తే...

గంగ : నాకేం నామర్దాలేదు, నీ కేదైనా ఇబ్బంది అయితే ఆఫీసు వంటవాడు సరాదాగా పిల్చి వంట చేయించుకుంటున్నానని చెప్పు.

శంక : మిమ్మల్ని వంట వాడిగా ఎలా సార్ చెప్పేది... నాకు నోరు రాదు సార్....

గంగ : సరే ...నేనే చెప్పుకుంటాగానా , నువు వెళ్ళి చెప్పిన సరుకులు త్వరగా తెస్తావా. ? నన్నే వెళ్ళి రమ్మంటావా ?

శంక : అక్కర్లేద్సార్ ఎంతయినా మీరు నా బాసు నేనే వెళ్ళి వస్తా సార్ డాక్టర్ గారు వస్తే.

గంగ : అంతా నేమేనేజ్ చేస్తాగా, నువ్వెళ్ళిరా, త్వరగా బయల్దేరవయ్యా....

శంక : అలాగే సార్... కానీ సార్. నా వైఫ్‌కి ఈ సంగతి తెల్సిందంటే విడాకులు ఇచ్చేస్తుంది. అంచేత భారం అంతా మీ మీదే సార్.

గంగ : హానెస్టుగా చెప్తున్నా, నాకు బి.పి రేజవుతుంది. తిక్కరేగిందంటే లేచక్కా పోతా నీకేం భయంలేదు నేవున్నానంటే ఇంకా నసుగుతావేమిటయ్యా ! అయినా నువ్వేం బాలాకుమారిడివా ఆ భయం ఏమిటి ఛండాలంగా పురుషుడన్నాక పులిలాగా వుండాలి. నీకేం భయంలేదు. నువ్వు వెళ్ళిరా...వూ...

శంక : ఇప్పుడు ధైర్యం వచ్చింది సార్... మార్కెట్టుకెళ్ళి చిటికెలో వస్తా ( బయిటికి వెళ్ళి పోయాడు గంగరాజు ఇంటిని పరీక్షగా చూస్తున్నాడు )

గంగ : పోర్షన్ బాగానే వుంది. శంకర్రావు వైపుది మంచి టేస్టు చక్కగా డెకరేట్ చేసింది. దేనికైనా యోగం వుండాలి. మా తాయారు వుంది. దేనికీ, శుద్ధ వేస్టు...బెడ్ రూమ్స్ ఎలా వున్నాయో చూద్దాం.

( గంగరాజు ఒక గదిలోకి వెళ్ళాడు. సత్తిబాబు బయిటినుంచి వచ్చాడు. సిగరెట్ ప్యాకెట్లు, యాపిల్స్ చేతుల్లో వున్నాయి ఆ రెండు వస్తువుల్ని టీ పాయ్ మీద పెట్టి )

సత్తి : బావా స్నానం చేస్తున్నాడల్లా వుంది. ఈ లోపు యాపిల్ ముక్కలు కోసి ముందుంచితే మెచ్చుకుంటాడు ( అని కత్తి తెచ్చుకోవడానికి వంట గదిలోకి వెళ్ళాడు గంగరాజు గదిలోంచి బయిటికి వచ్చి యాపిల్సుని చూసి ఆనందంగా )

గంగ : అబ్బో ! అపుడే ఫ్రూట్స్ వచ్చేసాయ్. ఏమో అనుకున్నా చాలా ఫాస్ట్

(అని యాపిల్స్‌ని తీసుకున్నాడు. కొరుక్కుతింటూ )

శంకర్రావు ! ఆ రూంలో వున్నాడా !

శంకర్రావు ! కూరలు ఏం తెచ్చావు.

( అనుకుంటూ రెండో గదిలోకి వెళ్ళగానే సత్తిబాబు కత్తి పుచ్చుకుని అక్కడికి వచ్చాడు. యాపిల్ కనిపించక అటు, ఇటూ చూస్తూ )

సత్తి : యాపిల్ కాయేది ! బావ తీసుకున్నాడా. యాపిలంటే అసహ్యమే ! బావా ! బావా...

( అనుకుంటూ మరో గదిలోకి వెళ్ళగానే గంగరాజు ఇంకో గదిలోంచి అక్కడికి వచ్చి )

గంగ : శంకర్రావు ఏ గదిలోనూ లేడు. ఏదో గొంతు వినిపించింది. శంకర్రావు ! నిన్నేనయ్యా ! ఎక్కడ

( ఇంకో గదిలోకి వెళ్ళగా, సత్తిబాబు అక్కడికి వచ్చి )

సత్తి : బావ, ఎక్కడా లేదు..టాయిలెట్లో కూర్చుని పండు గాని తంటున్నాడా ?

( అనుకుని ఇంకో గదిలోకి వెళ్లాడు బయిటినుంచి రాం బ్రహ్మం, ఆ వెనకే వాసు వచ్చారు. రాం బ్రహ్మం సొంత ఇంటికి వచ్చినంత క్యాజువల్‌గా వున్నాడు. వాసు మాత్రం తెగ కంగారు పడిపోతూ రాంబ్రహ్మాన్ని బయిటికి లాక్కుపోయే మూడ్లోవున్నాడు )

వాసు : మావయ్యా... ఇది ఎవరి ఇల్లో ఏమో ! సొంత మనుషుల్లాగా ఇలా జొరపడటం డేంజర్ వెళ్ళిపోదాం పది...

రాం : అదే తప్పు గుండె ధైర్యం కావాల్రా ! ఇల్లు ఎవరిదైతే మనకి దేనికి మన దగ్గర ఆర్టుంది. ఆర్టుతో అవతల వాళ్ళని ఆపించేస్తాం....

వాసు : వాళ్ళకి చావగొట్టి చెవులు మూసే ఆర్టు ఉంటుంది. అదర గొట్టి అవతల పారేస్తారు నా మాటవిను పోదాంపద...

రాం : కాలు ముందుకు వేసాక వెనక్కి తీసుకుని పారిపోవటం నా బావ రాంబ్రహ్మంకి తెలీదు. బయట శంకర్రావని బోర్డు చూసాం మాటకలిపి మేనేజ్, చేస్తాం క్లిక్కయితే భోజన ఫలహారాలు ఆరగిస్తాం. లక్కు బాగుండకపోతే సారీ అని చెప్పి జారుకుంటాం.

( సత్తిబాబు కత్తి పుచ్చుకుని అక్కడికి వచ్చాడు రాంబ్రహ్మం వాడిని చూసి శంకర్రావు అని అనుకున్నాడు )

సత్తి : ఎవరండీ ?

రాం : ఏరా ? శంకూ ! గుర్తుపట్టేవా. ఎపుడో పసిగుడ్డుగా వున్నప్పుడు చూసాం గుర్తురాలేదా ? నేన్రా రాంబ్రహ్మం అంకుల్ని.

సత్తి : బావకోసం వచ్చారా ! ఆరి గురించే వెతుకుతున్నానండీ యాపిల్ తీసుకుని మాయ మయి పోయాడండీ...

వాసు : వీడు పని కుర్రాడిలా వున్నాడు.

రాం : కరెక్ట్ వీడు శంకర్రావు కాదు. కాని కత్తి పుచ్చుకుని తిరుగుతున్నాడు.

వాసు : అందుకే పోదాం పద.

సత్తి : నిలబడే వున్నారు కుర్చోండి బావ వచ్చేస్తారు. ఏం తీసుకుంటారు

వాసు : మాకేం అక్కర్లేదు మేం వెడుతున్నాం మళ్ళీ వస్తాం అని శంకర్రావు గారికి చెప్పు....

సత్తి : నాకేం చెవుడు లేదండి... ఇంత పెద్దగా అరవక్కర్లేదు నాకంతా అర్థమైంది. బావ మీరొస్తారని చెప్పారు మీరు ఏం అడిగితే అది ఇవ్వమని కూడాచెప్పారు.

రాం : చెప్పాడా... చెప్తాడ్రా శంకర్రావుకి బాగా కావలసిన వాళ్ళం. దాయాదులం మా పిన తండ్రి వారి పెద్ద తండ్రి ఒకే తండ్రి పిల్లలు రాకపోకలు లేక...

సత్తి : చాలా సంతోషంబాబు ఇటివ్వండి ( చెయ్యి చాపాడు )

వాసు : వీడు చెవిటి వెధవ లాగా వుండి. చెయ్యి జాపాడు దేనికీ..

రాం : పండుగ మామూలు గురించేమో !

( జేబులోంచి అయిదు వందల కాగితం తీసి చూపిస్తూ )

వెళ్ళేటప్పుడు ఇస్తాలే...చిల్లరలేదు...పెద్ద కాగితం వుంది

( సత్తిబాబు అతని చేతుల్లో కాగితం చటుక్కున లాక్కుని )

సత్తి : దేవుడున్నాడు బాబు ...కూర్చోండి క్షణంలో వస్తా ( లోనికి వెళ్ళాడు )

వాసు : వాణ్ణి తగలెయ్య అలా లాక్కుపోయేడేమిటి ? ఇపుడెలా ?

రాం : అదే పజిల్లా వుంది ఇంట్లో ఎవడూ లేడా ?

( గంగరాజు గదిలోంచి వస్తూ )

గంగ : ఎంతమాట, మీరోస్తున్నారని శంకర్రావు ...అదే మా అయ్యగారు చెప్పారు కూర్చోండి.

రాం : మీరెవరూ ?

గంగ : నేను ఈ ఇంట్లో వంట వాడిని. అసలు నా గురించే మిమ్మల్ని రమ్మంది. రాత్రిపూట కాళ్ళు లాగుతూవుంటాయి. అది కాళ్ళలో సూదులు పెల్లిగుచ్చుతున్నట్లు బాధ షుగరేమో లేదన్నారు. కాని వుండే వుంటుందని నా నమ్మకం.

వాసు : ( మెల్లిగా ) మనల్ని డాక్టర్, కంపౌండర్ అనుకుంటున్నాడల్లే వుంది. కాదని చెప్పి జారుకోవడం ఆరోగ్యకరం

రాం : కరెక్టే, కాని వాడు తీసుకుపోయిన డబ్బుల మాటేమిటి ? అవి రాబట్టుకునే దాక గౌరవప్రదమైన డాక్టర్ లాగా నటించడం మంచిది.

గంగ : ఏమిటి మీలో మీరు డిస్కస్ చేసుకుంటున్నారు. బాగా కాంప్లికేటెడ్ కేసంటారా ?

రాం : నువు ఈ ఇంట్లో వంటవాడివా ?

గంగ : మీరు  డాక్టర్ కాదా ?

రాం : ఇతను నా కాంపౌండర్...

గంగ : అయితే... నే వంట వాడినే...

వాసు : ఆయన  అది కాకపోతే...

గంగ : నే ఇది కాదు...

( వాసు, రాంబ్రహ్మాన్ని లాక్కుపోయి రహస్యంగా )

వాసు : ఇదేదో మడతపేచి  గొడవ లాగావుంది. మావయ్య నా మాట విను పోదాం పద.

రాం : అయిదొందలు ఆ వెధవదగ్గర  లాకప్పయివుంది....దాన్ని రాబట్టుకోవాలి. నిజం తెలిస్తే చెప్పుచ్చుకు తంతారు. అంచేత నా బాబువి కదూ....కాస్సేపు నే చెప్పినట్లు విను. నీకేం  భయం లేదు.

గంగ : ఏమంటాడు

రాం : అతనిదొక విషాద కథ. కావడానికి కంపౌండరే కాని, బ్రహ్మ చెవుడు, మొన్న ఫిల్మ్ నగర్లో బాంబులు పెడితే ఎవరన్నా తుమ్మారా అని అడిగాడు.

గంగ : కాని ఇపుడు  మామూలుగానే మాట్లాడేడుగా ?

రాం : అలా మీకు అనిపిస్తుంది. నేను మీ యూరిన్ పరీక్ష చెయ్యాలా వద్దా అని అడిగితే యూరియా మంచి చెడుల  గురించి మొత్తం చెప్పాడు. అంచేత మీరు అపార్థం చేసుకోకండి.

గంగ : కాని మీరు నన్ను మీరు..... మీరు.... అనటం ఏం బాగేలదు. నన్ను, నువ్వు....నువ్వు అనండేం కూర్చోండి తెస్తా...

రాం : ఏమిటి ఏం తెస్తారు.

గంగం : సీసాలో యూరిన్ పట్టుకోస్తా.

( వాసు కెవ్వుమని అరిచాడు )

గంగ : ఏమైంది ?

రాం : మొన్న హైడ్రోసిల్ ఆపరేట్ చేస్తున్నప్పుడు పక్కన నిల్చోపెట్టి  మొత్తం చూపించా. అది గుర్తొచ్చినప్పుడల్లా అలా అరుస్తుంటాడు. కాసిని నీళ్ళు పట్రా

గంగ : అంటే యూరిన్ ఇప్పుడొద్దంటారా ? ముందు వాటర్ తీసుకుంటారా ?

వాసు : తర్వాత యూరిన్ తీసుకుంటారా ..( అన్న లెవెల్లో అడుగుతున్నాడు )

రాం : ఎపుడు  ఏం తీసుకోవాలో , ఎపుడు తీసుకోకూడదో డాక్టర్‌గా నాకు తెల్సు వెళ్ళు
వాటర్  తీసుకురా వెళ్ళు
( గంగరాజు  లోనికి వెళ్ళాడు )

వాసు : మావయ్యా ...అబద్ధం పైనా, అబద్ధం చివరికి పెద్ద చిక్కుల్లో  పడిపోయి  పరువు, డబ్బు పోగొట్టుకుంటాం పారిపోదాం  పద.

రాం : మరి అయిదొందలు  మాటో... కాఫీ పౌడర్ తెమ్మని మీ అత్తయ్య  ఇచ్చిన డబ్బు పోయినాయని చెప్పినా  నమ్మడు.
( అంతలో సత్తిబాబు వచ్చి చీపురుతో చిమ్మడానికి ఇద్దరికి నమస్కరించి గది వూడవటం  మొదలెట్టాడు )

వాసు : దణ్ణాలు  పెడుతున్నాడు  ఇదేదో  అనుమానంగా ఉంది.  డబ్బుల సంగతి అడుగు. రాం నువ్వు తొందర  పడకు.  నే లయగా  అడుగుతాగా, చూడు  బాబు నీ పేరేమిటన్నావ్

సత్తి : వాళ్ళొస్తారండి, వచ్చే వేళయింది. యాపిల్  సంగతే  తేలకుండా ఉంది.

గంగ : తీసుకోబాబు.  పాపం కుర్రాడిని చూస్తుంటే  జాలేస్తుంది.  చెవిలో మిషన్ పెట్టించక పోయారా ?

సత్తి : నేవున్నాగాబాబు, చెప్తే నే  తెచ్చేవాడినిగా,  మీకు దేనికి శ్రమ

రాం : ఆ కుర్రాడెవరు !  ఇతని పేరేమిటి ?

గంగ :  మీరు పేషెంట్‌ని తన పక్కవాడి గురించి ఎంక్వయిరీ  చెయ్యటం ఏం బాగా లేదు. ఈ  ఇంట్లో వంట  వాడిని  నేనే.  వాడు వంట  వాడినని  చెప్పుకున్నా  నమ్మకండి. నోరు తెరిస్తే  అబద్ధం.

రాం : నాకంతా అయోమయంగా  ఉంది.

వాసు : దిగులు పడకు,  కావాలనే  ఈ కష్టాన్ని  కోరి తెచ్చుకున్నావ్. అర్థం లేని మెలికలతో ఇంకా  పరిస్థితుల్ని  జటిలం చేసుకోవడం  అర్థం లేని పని.  నీ శ్రేయోభిలాషిగా నా మాట విను జరిగింది మొత్తం  చెప్పి సమస్యని  పరిష్కారం  చేసుకోవడం ఉత్తమం  అంది సునీత.

గంగ :  సునీతా !  ఆవిడెవరు ? అతను అలా తనలో తాను మాట్లాడుకుంటూ ఉంటాడు.

రాం : అది మాట్లాడుకోవటం కాదు.  తను వ్రాయబోయే  నవలలో  పాత్రలు చెప్పే మాటల్ని  అలా పఠనం చేసుకుని తర్వాత వ్రాస్తుంటాడు.

గంగ : అలాగా, అంటే  మీ కంఫౌండర్లో  రచయితలు కూడా ఉన్నారన్నమాట. అవునూ చీపురు పుచ్చుకుని  ఇలా వచ్చాడే వాడు మీతో నాగురించి ఎవన్నా చెప్పాడా ?

వాసు : కలిసివచ్చిన ఈ అవకాశాన్ని  వాడుకోవాలని గట్టిగా నిర్ణయించుకున్నాడు  శేఖర్.

రాం : వాడేం చెప్పి చావలేదు కాని, రాగానే  మా దగ్గర అయిదొందలు  తీసుకున్నాడు. నోటు అలా చూపించాను, ఇలా లాక్కుపోయాడు కాస్త మీరు  హెల్ప్ చేసి, ఆ డబ్బు మాకిప్పించేస్తే...

గంగ : మీరు  డాక్టర్లు,  నేనా వంటవాడిని, సూదికి, కత్తెరకు  ఉన్నంత తేడా  వుంది అయినా ప్రయత్నిస్తా. మరి నా యూరిన్ పార్శిల్ చేసి  తీసుకురమ్మంటారా ?

వాసు : సరే అనటంలో  ఉన్నంత లాభాలు శేఖర్‌కి కొట్టొచ్చినట్లు  సునీత మాటల్లో కనిపించాయి.

రాం : అలాగే కాని, చిన్న  అతి చిన్న సీసాలో  తీసుకురావాలి మరి.

గంగ : థాంక్యూ డాక్టర్ ....ఇపుడే వస్తా....

రాం : అది కూడా పట్టుకురండి.

గంగ : పట్టుకు రావడానికేగా వెడుతుంది ( లోనికి వెళ్ళిపోయాడు )

వాసు : మావయ్యా చెప్తే  విన్నావా, ఇపుడు చూడు ఎలా ఇరుక్కుపోయామో, అత్తయ్య కాఫీ పౌడర్ గురించి ఎదురు చూస్తూ ఉంటుంది.

రాం : ఇన్నేళ్ళు నా అనుభవంలో  ఇలా ఎపుడు  జరగలేదు ప్రస్తుతం  నా ఆలోచనల్లో  మీ అత్తయ్య  కాదు వుంది. వాడు తెచ్చే యూరిన్ సీసా ఎలా తీసుకుపోవాలా అని ఆలోచిస్తున్నా.

( శంకర్రావు మార్కెట్ నుంచి సంచి పుచ్చుకుని  వచ్చాడు.  రాంబ్రహ్మాన్ని, వాసుని చూసాడు గౌరవంగా  పలకరించాడు )

శంక : నమస్కారం..... నా పేరు శంకర్రావు ఎంత సేపయింది వచ్చి. మీరొస్తారని సార్ చెప్పారు. విషయం పట్టుకొచ్చారా ?

రాం : పట్టుకు రావడానికే ఆయన వెళ్ళారు.

శంక : అంటే, బయటికి వెళ్ళారా.

రాం : కాదు లోనికి వెళ్ళారు

శంక : లోనికి విషయం తేవటానికి వెళ్ళారా. కూర్చోండి ఇపుడే వస్తా.

( లోనికి వెళ్ళబోగా, గంగరాజు ఎదురొచ్చాడు )

గంగ : వచ్చావా ! రైస్ రెడీ, కర్రీ ప్రిపేర్ చేసి, అప్పడాలు, వడియాలు వేయించేస్తా, అద్సరే మనింట్లో ఖాళీ బీరు సీసాగాని ఏదైనా వుందా ?

( ఆ మాటలు విని, రాంబ్రహ్మం, వాసులు భయంగా ఒకరిమోహాలు ఒకరు చూసుకున్నారు )

శంక : ఖాళీ బీరు సీసానా ? దేనికి సార్?

గంగ : చెప్తాగా, పనుంది, విషయం పట్టివ్వడానికి....

రాం : అదేమిటి సార్ ...విషయం వెళ్ళి పట్టుకురావాలా.

రాం : పట్టుకురాక, పబ్లిగ్గా పడదామా ?

వాసు : బీరు సీసాట. అంత ప్రయత్నం వద్దని చెప్పు....

శంక : దొడ్లో స్టోర్ రూంలో వుండాలి. సత్తిబాబుని అడగలేకపోయారా..... రేయ్ చెవిటి పక్షి ఏం చేస్తున్నావురా ?

( గంగరాజు, శంకర్రావులు లోనికి వెళ్ళారు )

రాం : ఈ శంకర్రావు అనే వ్యక్తి వంటవాడిని సార్ అంటున్నాడు. చెవిటి వాడిని, చూసి విసుక్కుంటున్నాడు, చిత్రంగా వుందే...

( సత్తిబాబు అక్కడికి ఏదో పనిమీద వచ్చి ఇద్దరికి నమస్కరించి )

సత్తి : అయ్యగారొచ్చేసారు దొడ్లో సీసాలు వెదుకుతున్నాడు.

రాం : రేయ్ బాబు...ఇలారా...డబ్బుల్రా ! నా దగ్గర తీసుకున్నావే అయిదు వందల కాగితం. అదీ. ఆ..అదీ ఇచ్చేస్తావా ?

సత్తి : అదాండీ ...ఇందాకటి నుంచి ఆలోచిస్తున్నా. ఎంట్రా సార్ మాట్లాడుతుంటే రావటం లేదూ అని.

రాం : నా మాట వినిపించిందా ?

సత్తి : వినిపించింది బాబు. తిరగటంలో తప్పేంవుంది బాబు అవసరం అలాంటిది. మీరు మాత్రం ఎంత సేపని వుగ్గి పెట్టుకుంటారు. ఇలా నాతో రండి...రండి బాబు....

రాం : వే వెళ్ళి ఆ పని పూర్తి చేసుకోస్తాగాని ... నువు చెవిటి వాడిగానే కంటిన్యూ అవ్వు. అనుమానం వస్తే అవస్థల్లో పడగలం.

( సత్తిబాబుదారి చూపిస్తుండగా రాంబ్రహ్మం లోనికి వెళ్ళాడు వంటగదిలోంచి శంకర్రావు. గంగరాజు అక్కడిక వచ్చారు. వంటరిగా వున్న వాసుని చూసారు )

శంక : ( వాసుతో ) ఆయనేరీ.... లోపలికెళ్ళారా....

గంగ : వాడికి చెవుడట, మామూలు చెవుడు కాదు. పక్కనే బాంబులు పడ్డా, ఏ మార్పు ఉండదట.

శంక : అరెరె...అలాగా పాపం. బతకని బిడ్డ బారెడు అన్నట్టు. ఆ చెవులు చూడండి చేతులంతా వున్నాయి.

( వాసు ఆ సంభాషణ మొత్తం వింటూ నార్మల్‌గా వుండటానికి శత విధాలా ప్రయత్నిస్తున్నాడు శంకర్రావు అతని మోహం వంక తేరిపార చూసి )

గంగ : ఏమిట్రా ఏమైంది ...ఏవన్నా కావాలా ?

వాసు : మరీ ఇంత మోసమా – అని ఆశ్చర్యపోయాడు శేఖర్

గంగ : పట్టించుకోకు అలా ఏదో వాడి లోపల వాడు వాగుతూ వుంటాట్ట. అవునూ డాక్టర్ గారు లోపలికి వెళ్ళి చాలా సేపైంది. ఏం చేస్తున్నట్లు.

శంక : డాక్టర్ గారా ! సార్... అంటే ఆయన డాక్టరా ?

గంగ : శంకర్రావు నువు ఒక్కోసారి ఎలా మాట్లాడతావంటే, వినే వాడికి వళ్ళు మండిపోతుంది. డాక్టర్ అని తెల్సి ఆయన డాక్టరా అని అంత అమాయకంగా అడుగుతావేమిటయ్యా...

శంక : ఓ...అదా ...సారీ. సార్...సారీ ...( ముందుకు వచ్చి మెల్లగా ) వాళ్ళ క్లాస్‌మీట్ డాక్టరని చెప్పేవుంటాడు మర్చిపోయివుంటాడు లేకపోతే బాసుకి అంతకోపం ఎందుకు వస్తుంది.

( అంతలో రామబ్రహ్మం. సత్తిబాబులు అక్కడికి వచ్చారు )

వాసు : వెళ్ళిన పని అయిందా అని అడిగాడు శేఖర్ ఆత్రంగా....

రాం : వాడికి ఆ చెవుడు ఒక్కటే కాదు. శాడిజం కూడా వుంది. లేకపోతే టాయ్‌లెట్లోకి వెళ్ళనిచ్చి బయట గడియ పెడతాడా.

శంక : ఎవర్ని గురించి మీరు మాట్లాడుకుంటున్నది.

గంగ : పట్టించుకోకు..... అసలేం విననట్లుగా నటించు

వాసు : నాకు ఒక కొత్త విషయం తెల్సింది. నీకు వెంటనే చెప్పాలి. చాలా ముఖ్యమైన రహస్యం అన్నాడు శేఖర్ సునీతతో

రాం : నాకిప్పుడు వినాలని లేదు. తర్వాత మాట్లాడుకుందాం అంది సునీత కటువుగా .... మిమ్మల్ని సార్ అనాలో... ఏరా అనాలో అర్థం కాకుండా వుంది, ఆ డబ్బు గురించి ఏం చేసారు

శంక : ఏ డబ్బు గురించి.

గంగ : పట్టించుకోకు

శంక : విననట్లునటిస్తా...

గంగ : వెరీగుడ్...క్యాజువల్గా తీసుకో అంతే...

శంక : రాక రాక మా యింటికి వచ్చారు మీ గురించి సార్ చెప్తుంటారు వంటయి పోయింది. వేరే ప్రోగ్రాం ఏం లేదంటే బోజనాలు చేద్దాం ...అరెరే...

గంగ : ఏమైంది...

శంక : కిళ్ళీ షాపు వాడికి కిళ్ళీలు కట్టమని చెప్పి డబ్బులు కూడా ఇచ్చి వచ్చేసా...... వెళ్ళి నే కిళ్ళీలు పట్టుకొస్తా

( వెళ్ళి పోయాడు )

గంగ : అలాగే సార్ .... మా సార్ చాలా మంచివాడు.. వంటమనిషిని కూడా గౌరవంగా సార్, సార్ అని పిలిచేరకం.

వాసు : అంతా అబద్ధం, నాటకం అరిచి ప్రపంచానికి చెప్పాలనుకున్నాడు శేఖర్.....

రాం : అలాగే వెళ్ళి చెప్పమంది సునీత నాకు వళ్ళు మండిపోతుంది.

గంగ : మీరు ఆ డబ్బులు గురించి వర్రీ అవుతున్నారు. మీకో చక్కని సలహా చెప్తాను. దొడ్లో రేకుల షెడ్డులో చెవిటి వాడి నివాసం అక్కడికి వెళ్ళి పెట్టిగాని వెతికారంటే మీ డబ్బులు మీకు దొరకిపోతాయి.

రాం : నిజంగానా ! అదే నిజమైతే మీనెత్తిన పాలు పోస్తా...

గంగ : అదేం వద్దు... నా యూరిన్ బాటిల్ నెత్తిన పెట్టుకుని వెళ్ళండి.

రాం : నే వెళ్ళి ఆ ప్రయత్నం కూడా చేస్తాను.. .నువ్విక్కడ తగలడు ఇవాళ లేచి ఏం మొహం చూసామో....

( రాం బ్రహ్మం పడగ్గదిలోకి వెళుతుండగా, సత్తిబాబు వంటగదిలోంచి అక్కడికి వచ్చాడు )

సత్తి : ఎక్కడికి బాబు ఆయనలా పరిగెడుతున్నాడు ?

గంగ : ఎవరు డాక్టర్ గారి గురించేనా నువ్ అడుగుతున్నది. ఆయనకి పర్సనల్ పని మీద వెళ్ళాల్సివచ్చి పరిగెతున్నాడు.

సత్తి : బాబు. మీకో సంగతి చెప్పాలి....చాలా ముఖ్యమైన సంగతి

( అనుమానంగా వాసు వంక చూసాడు )

గంగ : వాడికి వినిపించదు....చెవుడు ...పర్లేదు చెప్పు....

సత్తి : ఏంటండీ .....ఇతడికి కూడా చెవుడా...అరెరె....మొహం చూస్తుంటే అమాయకుడిలా వున్నాడు.ఆ దొంగ డాక్టరికి ఎలా దొరికాడు ?

గంగ : దొంగ డాక్టరా...అంటే వాడు శంకర్రావు ఫ్యామిలీ డాక్టర్ కాదా ?

సత్తి : కాదా అని అడుగుతున్నారా...ఆడు దొంగ డాక్దరండీ బాబు మా అమ్మగారి ఫ్రెండు మొగుడు శివరావు గారని నాకు బాగా తెల్సండి. ఎర్రగా, లావుగా...సల్మాన్‌ఖాన్‌లా ఉంటాడు. ఈడెవడో దొంగ వెధవండి. పాపం ఈ చెవిటి కుర్రాడిని గూడ మోసం చేస్తున్నాడు.

గంగ : అలాగా.... అందుకా శంకర్రావు ఆయన డాక్టరా అని అడిగాడు...

సత్తి : ( వాసుతో ) ఈడు డాక్టర్ కాదు... దొంగ ...దొంగ డాక్టర్...పిచ్చినాయాలా పారిఫో....వాడ్ని మా అయ్యగారు పోలీసులకి పట్టిస్తారు. నువు పారిఫో...

( వాసు అసహనంగా పచార్లు చేస్తుంటాడు )

గంగ : అనవసరంగా సీసా కడిగి ఎండలో పెట్టా..... సరే పోలీసుల్ని పిల్చి పట్టిస్తే సరి, మొత్తం స్టోరీ బయటికొస్తుందిగా

సత్తి : బాబూ

గంగ : ఇంకో విషయం మీకు చెప్పుకోవాలి బాబు... నా సొంత విషయం.

సత్తి : చెప్పు.... ఏమిటి సంగతి.

( ఈ లోపు వాసు అదను చూసుకుని దొడ్లోకి పారిపోయే ప్రయత్నంలో పడగ్గది గుమ్మందాకా వెళ్ళాడు. అది గమనించి సత్తిబాబు చటుక్కున వెళ్ళి వాడి చెయ్యిపట్టి – ఆపి గంగరాజుతో )

సత్తి : చూసారా బాబు...చెవిటి వాళ్ళు ఎంత అమాయకులో ....ఈ కుర్రాడు ఇంకా వాడి వైపుకే పరిగెడుతున్నాడు....( వాసుతో ) నీకే భయంలేదు. మనం మనం ఒకటి .... ఐక్యంగా వుండాలి )

గంగ : సరేలే సంగతేమిటో చెప్పు....

సత్తి : మీరు చెప్పొదన్నా చెప్పేస్తా బాబు చెవిటి వాళ్ళు దొంగలు కాలేరు బాబూ.... ఆళ్ళు పసిబిడ్డలాంటి వాళ్ళు.

గంగ : సరేలేరా... అసలు సంగతేమిటి ?

సత్తి : నేనే దొంగ వెదవని అని మా అయ్యగారి నమ్మక మండి. ఎలాగైనా నన్ను పన్లోంచి తీసి పారెయ్యాలని ప్రయత్నాలు చేస్తుంటారండి !

గంగ : సరేలే.... నువ్వు మంచి వాడివని నే చెప్తాలే... సరేనా....

సత్తి : అమ్మగారి వుంగరం పోయిందండీ... అది నే తీసానని అయ్యగారి అనుమానమండీ...

గంగ : నిజంగా తీసావా ?

సత్తి : గది శుభ్రం చేస్తుంటే అది సోఫా క్రింద దొరికిందండీ....

( జేబులోంచి తీసి చూపించాడు. వాసు పారిపోవడానికి ప్రయత్నించాడు. సత్తిబాబు చెయ్యి గట్టిగా పుచ్చుకుని ఆపాడు )

గంగ : ఆమాట చెప్పి శంకర్రావుకిచ్చేయి.... ఏం అనడులే...నే చెప్తాగా....

సత్తి : నమ్మరు బాబూ... దొంగ యెధవని తిట్టి పోస్తారండీ !....మీరే ఏదైనా వుపాయం చేసి నాకు సహాయం చెయ్యాలి.

గంగ : సరే... ఓ పని చేద్దాం. ఎలాగూ మనకి దొంగ డాక్టర్ చేతిలో వున్నాడుగదా, వాడు వచ్చాక ఈ వుంగరాన్ని వాడికి తెలీకుండా వాడి జేబులో వెయ్యి, నే పోలీసులకి ఫోన్ చేసా. సరిపోతుంది. ఒక్క దెబ్బకి రెండు పిట్టల పథకం. ఎలా వుంది.

( వాసు ఇపుడు కంగారుగా సత్తిబాబు బారినుండి విడిపించుకోవడానికి గింజుకున్నాడు )

సత్తి : ఏహే ఆగు... వెర్రి మొహం ...నీకేం భయంలేదు... మనం మనం ఒకటి ఐక్యంగా వుండాలి. ...తనేమో గొప్ప ప్లాన్ చెప్పారు కాని అర్ధమై చావలా.... ఇంకొక్కసారి చెప్పండి... ఏం చెయ్యమంటారు.

గంగ : ఈ వుంగరాన్ని ఆ దొంగవెధవ జేబులోకి

సత్తి : ఆడి జేబులో ఈ వుంగరాన్ని వేసయ్యమంటారా .....

గంగ : అద్గదీ.... నేను పోలీసులకి ....ఫోన్...

సత్తి : అర్ధమయిందండీ... దాంతో ఆడిరోగం కుదురుతుంది. నువ్వేం కంగారు పడకు సత్తిబాబు సంగతి నీకు తెలీదు....నచ్చితే ప్రాణాలిస్తాడు.

( రాంబ్రహ్మం కోపంగా విసురుగా వచ్చాడు. గంగరాజు తెచ్చిపెట్టుకుంటున్న గౌరవంతో )

గంగ : రండి డాక్టర్ గారు ...వెళ్ళిన పని అయిందా....

( సత్తిబాబు వాసుని వదిలి. ఇపుడు రాంబ్రహ్మం వెనకరెడీగా నిలుచున్నాడు. వాసు అసహనంగా, టెన్షన్‌గా సమయం కోసం చూస్తున్నాడు )

రాం : వాడి పెట్టెలో సబ్బుముక్కలు, చిల్లర డబ్బులు తప్ప పనికొచ్చే వస్తువేలేదు.

గంగ : అసలు నిజంగా అయిదొందలు వాడు తీసుకున్నాడా ? నిజం చెప్పు.

రాం : నిజం... నిజంగా తీసుకున్నాడు...వాడికి చెవుడని నాకు తెలీదు నా మాట నమ్మండి...పోయినాయని చెప్పినా నా వైఫ్ నమ్మదు. రెండ్రోజుల క్రితమే వంద పోయిందని చెప్పా....

( సత్తిబాబు వెనకనించి రాంబ్రహ్మం జేబులోకి వుంగరాన్ని జార్చే ప్రయత్నం చేయబోగా. వాసు ఆ ప్రయత్నం అడ్డుకునే ప్రయత్నంలో చటుక్కున రాం బ్రహ్మం గుండెలపై జేబు కనిపించకుండా వాలిపోయి బతిమాలుకుంటున్న ధోరణిలో )

వాసు : వెళ్ళిపోదాం మావయ్యా... అయిందేదో అయ్యింది. అత్తయ్యకి చెప్తా... నే పోగొట్టానని చెప్తా....

( సత్తిబాబు ఏం చెయ్యను అన్నట్టు గంగరాజు వంక చూసాడు గంగరాజు ఆ వుంగరాన్ని తను తీసుకుని, పైకి చూస్తూ )

గంగ : అదేమిటి పిచ్చిక గూడులో పచ్చ నోటులా వుంది.

( అంతా అటు చూసారు గంగరాజు వుంగరాన్ని వాసు జేబులో అతనికి తెలీకుండా వేసాడు )

రాం : నాకేం కనిపించటం లా...

సత్తి : ( వాసుతో ) నీకేం భయం లేదని చెప్పానా... మనం మనం ఒకటి ఐక్యంగా వుండాలి...

గంగ : అంతా ఓ.కే ధైర్యంగా వుండు

( వాసు కంగారుగా రాం బ్రహ్మం జేబు తడిమి చూసాడు వుంగరం లేదు. రాంబ్రహ్మానికి కోపం వచ్చింది )

రాం : ఏమిట్రా – వెధవ వెతకులాట నువ్వునూ ... జేబులో ఏం చచ్చాయని ( శంకర్రావు బయిటినుంచి చాలా కంగారుగా వచ్చాడు )

గంగ : ఏమిటయ్యా ....దేనికా కంగారు...ఏమైంది !

శంక : పెద్ద దొంగ తనం జరిగింది సార్ ఇద్దరు దొంగ వెధవలు మీవారి స్నేహితులమని చెప్పి ఇంట్లోకి వచ్చి కత్తి చూపించి నిలువుదోపిడి చేసి పారిపోయార్ట పది నిమిషాలు కూడా కాలేదు, బయటంతా గొడవగా వుంది.

గంగ : అయితే ఈ వెధవలే అయ్యుండాలి....శంకర్రావు ఇలారా ... నీకో సంగతి చెప్పాలి...

( పక్కకి లాక్కుపోయి ఏదో చెప్తు రాంబ్రహ్మాన్ని , వాసుని చూపిస్తున్నాడు )

వాసు : ఈ ఇంట్లో వుంగరం పోయిందటా, పక్కింట్లో దొంగతనం జరిగిందట. వీటికి మనమే కారణం అనుకుంటున్నారు. వెళ్ళిపోదాం పద.... అత్తయ్యకి అతికినట్లు అబద్దం చెప్తాగా.....

రాం : అయిదొందలు ఇస్తూ పోయాయని చెప్పినా నేనమ్మను అందిరా .... నా పరువు పోతుంది. ( సత్తిబాబుతో ) రేయ్...నీకు నమస్కారం చేసుకుంటా.... నా భార్య దగ్గర నా పరువు నిలబెట్టు...నోటురా నోటు డబ్బులది....

సత్తి : ఏంటీ నోట్లో వేసుకోవడనాకి ఎవన్నా కావాలా, తెచ్చి పెట్టమంటారా అయ్యగారిని అడగండి...నాదేం వుంది.

( గంగరాజు, శంకర్రావు దగ్గరగా వచ్చారు )

శంక : ఎమిటి డాక్టర్ గారు ఏదో వర్రీగా వున్నట్టున్నారు.

సత్తి : ఆరికి...నోట్లో వేసుకోవడానికి ఎదన్నా కావాలంటండీ....

గంగ : సైనెడ్ మాత్రలున్నాయని చెప్పు...సర్దాగా వేసుకుంటారేమో....

రాం : మీరేం మాట్లాడుతున్నారో నాకేం అర్ధం కావటంలేదు. సైనేడు మాత్రలో మాకేం పని ఏరా ! మాట్లాడవేం ?

గంగ : ఎందుకయ్యా ! ఆ చెవిటి కుర్రాడ్ని వెంటేసుకుని అడ్డమైన పన్లు చేయిస్తావ్ ! సిగ్గులేదూ ! ....చూడు బాబు నీకేం భయంలేదు మేమంతా వున్నాంగా జేబులో దాని గురించి అడిగితే నాకేం తెలీదని చెప్పు.... సరేనా....

( వాసు ఆ మాటలకి అనుమానంగా తన జేబు చూసుకున్నాడు వుంగరాన్ని చూసి వులిక్కిపడ్డాడు. సత్తిబాబు వంక చూసాడు )

సత్తి : నీకేం భయంలేదు....మనం మనం ఐక్యంగా వుండాలి....

శంక : సార్ .... ఆలస్యం దేనికీ స్టేషన్‌కి ఫోన్ చేసి యస్.ఐ.గార్ని రమ్మని చెప్తా.

గంగ : త్వరగా కానియ్... నేనీలోపు వాళ్ళని మాటల్లో పెడ్తాగా....

( శంకర్రావు ఫోన్ డయల్ చేస్తున్నాడు. గంగరాజు, రాం బ్రహ్మాన్ని మాటల్లోకి దించాలని ప్రయత్నించాడు )

గంగ : ఏమిటి డాక్టర్ గారు... ఈ ప్రాక్టీస్ మొదలెట్టి ఎన్నాళ్ళవుతుంది. పక్కింట్లో పేషెంట్లని చూపింది మనమేనా ?

రాం : నిజం చెప్తున్నా. అంతా వినండి నేడాక్టర్ని కాను

శంక : తెల్సు....నువ్వెవరో తెల్సు....దానికే ఏర్పాట్లు చేస్తున్నాం....

గంగ : డాక్టర్వి కదా ! అయితే ఇతను కంపౌండర్ కాదా !

రాం : కాదు, పైగా వాడికి చెవుడులేదు. గొణుక్కున్నా స్పష్టంగా వినిపిస్తుంది. కావాలంటే ట్రయి చెయ్యండి.

గంగ : అలాగా...నిజంగానా...

( వాసు రివ్వున వచ్చి గంగరాజు గుండెలపై వాలి ఆనందంగా )

వాసు : మీరెంత మంచివాళ్ళు సార్.... నన్ను ఇంతబాగా అర్ధం చేసుకున్నారు. మీకు జీవితాంతం ఋణపడి వుంటాను సార్....

( అంటూ తన జేబులోని వుంగరాన్ని గంగరాజుకి తెలీకుండా అతని జేబులో వేస్తాడు )

రాం : ఏమిటి ఓవర్ యాక్టింగ్ ....నీ గురించి వారేం అన్లేదు....అంత గుండెలపైన వాలి పోవాల్సింత అవసరం లేదు....

గంగ : శంకర్రావు ....నీ వైఫ్ రింగ్ పోయింది అవునా ! అదెక్కడుందో ఎవరు తీసారో నాకు తెల్సు....నువ్వేం కంగారు పడకు....

శంక : ( సత్తిబాబు వంక అనుమానంగా చూస్తూ ) నాకు తెల్సు సార్ నాకు మొదటినుంచి అనుమానమే ...అవునూ...మీకెలా తెల్సు....

సత్తి : అయ్యగారేదో అంటున్నారు ...నాకేం తెలీదు... వట్టు నా మట నమ్మండి.

గంగ : అవునయ్యా ....పాపం వాడికేం తెలీదు....అసలు దొంగ వేరే వున్నాడు... చూడు నువు మమకారాలకి ! అయ్యో పాపం అని జాలిపడి దొంగ వెధవని క్షమించే కార్యక్రమం పెట్టుకోకు చివరికి నేనైనాసరే గుండె రాయి చేసుకుని పోలీసులకి అప్పచెప్పి..... మనం మనలాంటి వాళ్ళం ధర్మాన్ని, న్యాయాన్ని కాపాడి దోషుల్ని శిక్షించాలి. ( అంతలో రాణి బయిటినించి కోపంగా చిర్రుబుర్రు లాడుతూ వచ్చింది )

రాణి : ఛీ....ఛీ....ఇవాళ లేచి ఎవడి మొహం చూసానో ఏమోగాని  అన్నీ
పోగొట్టుకోవడమే...

శంక : అదేమిటి ...ట్రయిన్ మిస్సయ్యావా ! నే చెప్తూనే వున్నా ఆలస్యం అవుతుందని

రాణి : అదేం కాదు ...ఆటోలో నా హ్యాండ్‌బ్యాగ్  మర్చిపోయా ... వీళ్ళంతా...

గంగ : అమ్మా నా పేరు  గంగరాజు.... మీ వారికి ఆఫీసర్ని  వుదయం ఫోన్ చేసి జరిగింది
చెప్పాడు.... వురుకులు, పరుగులుగా వచ్చా నువ్వు చాలా అదృష్టవంతురాలివి దొంగ
దొరికాడు....  ఇక్కడే వున్నాడు... కాస్సేపట్లో బయట పడతాడు.

రాణి : దొంగేమిటి... బయటపడటం ఏమిటి.... నాకేం అర్ధం కావటంలా ఏరా సత్తిబాబు
....డాక్టర్ గారొచ్చి చూసెళ్ళారా ?

శంక : రాణి... నే అన్ని సంగతులు చెప్తాగానీ ఇలారా ( చెయ్యి పట్టుకుని పక్కకి
తీసుకెళ్ళాడు )

రాం : బాబూ.... పెద్దవారు....మా తప్పు క్షమించి , దయతలచి మా డబ్బులు మాకిప్పించేస్తే
మేం  పోతాం.

గంగ : అలాగే ...అవునూ...ఎపుడైనా  జైలుకెళ్ళారా ?

వాసు : మీరెళ్ళారా...

గంగ : నేనా ...నాకేంపని ...అస్సలు చూడ్డానికి కూడా వెళ్ళలా....

వాసు : పెద్దవాళ్ళు చూసి వచ్చేస్తే ఏం బావుంటుందండీ... కొన్నాళ్ళు వుండేలాగా వెళ్ళిరండి.
...రెస్టుకి  రెస్టు అనుభవానికి అనుభవం.

రాం : నాకు ఒక ముక్క  కూడా అర్ధం కావడంలేదు. జైలేమిటి చూడటం, వుండటం
ఏమిటిదంతా ?

( శంకర్రావు , రాణిలు అక్కడికి వచ్చారు )

రాణి : అదా సంగతి ...ఇప్పటికి నా కర్ధమైంది. సత్తిబాబు  నిప్పులాంటి వాడని, అందుకే
అంటారు. సొమ్మొక చోటా, అనుమానం ఒక చోటని.

గంగ : బాగా చెప్పావమ్మా, నిర్భయంగా దొంగని పోలీసులకి అప్పచెప్పమని శంకర్రావుకి చెప్పా....

వాసు : కరెక్ట్ ...త్వరగా పోలీసులొస్తే బావుండు....

రాం : నిన్ను నోరు మూసుకుని ఉండమని చెప్పానా ! మూగవాడని చెప్పి చచ్చినా బావుండేది.

( గంగరాజు అప్పుడు తన జేబు చూసుకున్నాడు.తన జేబులో ఉంగరం ఉండటం చూసి ఉలిక్కి పడ్డాడు )

గంగ : ఇదేమిటి ఆశ్చర్యంగా వుందే...

శంక : ఏమిటి సార్... ఏమైంది

గంగ : అబ్బే ఏం లేదు....ఏం లేదు...ఇపుడెలా అనవసరంగా వాగి చచ్చానే

వాసు : ఆఫీసర్ గార్కి బరువు బాధ్యలు పెరిగినట్టున్నాయ్.

( ఆ మాటకి గంగరాజు రెండు చేతులు చాచి, వాసువైపుకి పరిగెడుతూ )

గంగ : ఎంత చక్కటి సంగతి చెప్పావయ్యా ఆఫీసర్లంటే నీకెంత గౌరవం. నీలాంటి కుర్రాళ్ళంటే నాకెంతో ఇష్టం. కమాన్ ఒక్కసారి నిన్ను నా బహువుల్లో బంధించి నా బరువుని, నా బాధ్యతని పెంచుకోనియ్యి ...ప్లీజ్....కమాన్....

వాసు : నేను అంత గొప్పవాడిని కాద్సార్, జస్ట్ సాధారణమైన వాడిని దానికి కారణం అదిగో అతను ఆ వంట కుర్రాడు. అతన్ని అభినందించండి.

గంగ : అలాగా ( సత్తిబాబు వైపుకి పరిగెడుతూ ) ఎంత గొప్పవాడివిరా నీకు సహాయం చేద్దామనుకుంటే, ఈ విధంగా ఋణం తీర్చుకుంటావని వూహించలేదురా ! రారా ! ఒక్కసారి ఇలారా !

సత్తి : చిన్నపిల్లలు రైలాట ఆడుకుంటున్నట్లు ఏమిటి సార్ అలా చేతులు చాచి పరిగెత్తుకొస్తున్నారు. నాకేం తెలీద్సార్ నాకేం తెలీదు (లోనికి పారిపోయాడు )

రాణి : సత్తిబాబు అమాయకుడు...వాడికేం తెలీదు. ఇంతకీ అసలు సంగతేమిటి.

( గంగరాజు చేతులు చాచిపెట్టి ఎవర్ని కావలించుకోవాలో అన్నట్లు అందరి వైపు చూస్తున్నాడు రాంబ్రహ్మం వంక చూసాడు )

వాసు : ( రాంబ్రహ్మన్ని కావలించుకుని ) ఈయన అంతగొప్పవాడు కాద్సర్, మీ అభిమానానికి. ఆలింగనాలకి అస్సలు పనికి రాడు.

గంగ : అయితే నేనెవర్ని అభినందించాలి ! త్వరగా తేల్చండి.

శంక : దేనికి సార్ అభినందించడం ...అసలేం జరిగింది.

గంగ : ( వేగంగా వెళ్ళి శంకర్రావుని కౌగలించుకుని )
అహ, ఎంత అమాయకత్వం నీలో నాకు నచ్చేది ఈ అమాయకత్వమే నువ్ నాకు సబార్డినేట్‌గా దొరకడం నా అదృష్టం. నా బరువు బాధ్యతల్లో ఇలా పాలు పంచుకొనే పరిస్థితి వస్తుందని వూహించలేకపోయాను. శంకర్రావు థాంక్యూ...థాంక్యూ వెరీమచ్
( ఆవుంగరాన్ని శంకర్రావుకి తెలీకుండా అతని జేబులో వేస్తాడు )

శంక : నాదేం వుందిసార్ ! అంతా మీ అభిమానం తన చేతి కింద పన్జేసే సిబ్బందిని మీ కన్న సంతానంలా చూసుకునే సంస్కారం ఎంత మందికుంటుంది చెప్పండి. పనిచేసినా చెయ్యకపోయినా.

గంగ : సర్లేవయ్యా ! ఏదో అన్నాగదాని అంత పొడుగు స్టేటుమెంట్లు ఇవ్వనక్కర్లా ...అబ్బా ప్రాణం హాయిగా వుంది. ఎంత రిలీఫ్.

వాసు : సర్లేవయ్యా ! ఏదో సాధించినంత ఫీలింగ్, గొప్ప రిలీఫ్‌గా వుంటుంది కదూ...

రాణి : ఏమిటండీ అసలు ఏమిటిదంతా...మీకేవన్నా అర్థం అవుతుందా
మిమ్మల్నే...అసలింతకు నా వుంగరం తీసిన దొంగ మొహం వెధవెవరని

శంక : తెలుస్తుంది రాణి ...తెలుస్తుంది ఒక్క క్షణం ఓపికపట్టు సిగ్గు, ఎగ్గు లేకుండా, గౌరవమర్యాదలు పాటించకుండా ఒక ఆడదాని వేలివుంగరాన్ని దొంగతనం చేసిన వెదవని పట్టుకుని నిలదీసి....

గంగ : శంకర్రావు ...ఎక్కువ ఆవేశ పడిపోతున్నావేమోనని నాకు అనుమానంగా వుంది.

శంక : లేద్సార్... ఇంత ఆవేశం వుండాలి ఆ దొంగరాస్కెల్ని పట్టుకుని నిలదీసి...ఏరా కడుపుకి అన్నం తింటున్నావా ? గడ్డి తింటున్నావా ?
( చెయ్యి జేబుకి తగిలింది. వుంగరం చూసుకున్నాడు )
ఇదేమిటి ?

రాణి : ఏమిటండి... ఏమైంది ?

గంగ : శంకర్రావు ...నిన్నే ...ఏదైనా షాకింగ్ సిట్యుయేషనా....

రాం : అయ్యా నా డబ్బులు  నాకిప్పిస్తే మేం పోతాం ఇక్కడ జరుగుతున్నదేది నాకు అర్థం కావటంలా.

రాణి : డబ్బు కావాలా ! డబ్బులు  కాదు దండలు వేసి సన్మానం  చేయిస్తాం.  కాస్సేపాగు ఏమండి ! ఏమిటి అలా నిబడి పోయారు.  పోలీసులకి  ఫోన్ చెయ్యండి.

శంక : అది కాదు రాణీ !  ఏం చెయ్యాలో  నాకేం అర్థం  కావటంలా  అసలు హౌ ఇట్ హేపెండ్...

వాసు : పాపం  ...వారు షాకులో  వున్నట్టున్నారు. కాస్త క్లూ ఇచ్చి కాపాడరాదు.

( అంతలో వింగులోంచి  ఒక చెయ్యి  స్కాచ్ బాటిల్ని  లోనికి ప్రవేశపెట్టి )

వాయిస్ : రాజబాబుగారు ఈ విషయం  ఇచ్చిరమ్మన్నారండి వారు అసలు  విషయం తీసుకుని  అరగంటలో వస్తానన్నారండి

( అక్కడున్న వారంతా షాకయ్యారు. వాసువెళ్ళి ఆ బాటిల్ని  తీసుకున్నాడు )

రాణి : విస్కీ సీసానా !  ఓరి నాయనోయ్, అందుకా  అంత ప్రేమగా వెంటబడి వూరు పంపించారు చెప్పండి. ఎన్నాళ్ళనించి  మీకీ అలవాటు. అసలు వీడు మీ ఆఫీసరేనా ! ఆ మొహం  చూస్తుంటే  అనుమానంగా వుంది.

శంక : సార్ ! అనుకున్నదంతా అయ్యింది.  చెప్పండి సార్ ! నోరు తెరచి  నిజం చెప్పి నా కాపురం  నిలబెట్టండి మిమ్మల్ని  మీరు రుజువు  చేసుకోండి.

రాం : అమ్మా, నువ్వు నా భార్యలాంటి దానివి, ఛ ఛ నా భార్య కూడా నీలాంటిదే ! ఎదురు చూస్తుంటుంది. ఆ డబ్బులుగాని  ఇప్పించేస్తే మేం పోతాం.

వాసు : స్కాచ్ బాటిల్ ముచ్చటగా వుంది. అమ్ముకుంటే ఎంతొస్తుందో....

గంగ : సరే జరిగింది మొత్తం పూసగుచ్చినట్టు చెప్తా ! అమ్మాయ్ నేను మీవారి  బాసునే. వట్టు నీ వుంగరం  పోయింది వెతకటానికి  హెల్పు  చెయ్యమంటే  ఆదరాబాదరాగా వచ్చా  ఇద్దరం  వంట చేసుకుంటూ వెతికాం.  అంతలో ఈ ముసలాడు డాక్టర్ని  అని వచ్చి నాటకం, ఆ సంగతి తెల్సి ఎస్.ఐ గారికి స్కాచ్ బాటిల్ ఇచ్చి, వీళ్ళని అరెస్ట్ చేయించి నీ వుంగరం  సంగతి రాబడదామని  మా ఫ్రెండ్‌కి ఫోన్ చేసాం.

శంక : కరెక్ట్. అదిగో బాటిల్ వచ్చింది. నువు అపార్ధం చేసుకున్నావ్.

వాసు : స్కాచ్ విస్కీ చేతిలో వుంది. పరిస్థితులు వేగంగా మారిపోతున్నాయి. ఈ కథ ఎటుపోతుందో చెప్పలేం. అంచేత చేతిలో వున్న స్కాచ్‌ని అమ్ముకుని అత్తయ్య దగ్గర పరువు నిలబెట్టుకోవడం ఉత్తమం అన్నాడు శేఖర్.

రాం : అది నిజమే. బంజారాహిల్స్‌లో ఒక రౌండ్ వేస్తే స్కాచ్‌ని ఎవడైనా కళ్ళకద్దుకుని తీసుకుంటారు. ఇన్నాళ్ళకి చక్కటి సలహా చెప్పావు అని మెచ్చుకుంది సునీత. పద పోదాం

( ఇద్దరూ వెళ్ళిపోయారు. సత్తిబాబు వచ్చాడు )

సత్తి : అక్కా దొంగ డాక్టరయినా దైవభక్తి ఎక్కువుంది. తిరుపతి వెళ్ళటానికి డబ్బులు పోగు చేసుకుంటున్నాని ఎవరు చెప్పారోగాని రాగానే అయిదొందలు చందా ఇచ్చారు.

గంగ : అదీ సంగతి వీడు చందా అనుకున్నాడు. సరె స్కాచ్ స్టోరీ అయ్యింది రాజబాబు అసలు విషయంతోగాని వచ్చాడో కొంపలంటుకుంటాయి. అంచేత నేవెళ్ళి విషయాన్ని వేరే దారిలో పట్టిస్తా ధైర్యంగా వుండు వస్తానమ్మా.

శంక : సార్ మీరు వెళ్ళిపోతే నాగతేం గాను. దీని సంగతేమిటి. దీనితో వేగలేను. నాకొద్దు సార్. దీన్ని వదిలించుకునే మార్గం చెప్పండి ప్లీజ్.

రాణి : నన్ను వదిలించుకునే మార్గం ఆయన చెప్పాలా ! అంటే నా పైన అంత మోహం మొత్తిందా !

శంక : అమ్మా ! అపార్ధం సార్ ! కాపాడండి.

గంగ : అపార్ధాన్ని అలా కాస్తా కంటిన్యూ చేసి భార్యని ఎంబ్రాసింగ్ పొజిషన్లోకి తీసుకుని వెడితే ప్రాబ్లమ్ సాల్వ్ అవుతుంది. ఆలోచించు అంతకన్నా నేనేం చెప్పలేను. వస్తా ఆల్‌దిబెస్ట్

( వెళ్ళిపోయదు )

రాణి : నాతో వేగలేరా ! నేను మీకొద్దా. వదిలించుకునే మార్గం వాడు చెప్పాలా. చెప్పండి ఎందుకిలా మారిపోయారు. మిమ్మల్నే చెప్పకపోతే నే వురేసుకుని ఛస్తా !

శంక : అమ్మో...రాణి అలా అనకు, నే వదిలించుకోవాలి, నా కొద్దు అన్నది నీ గురించి కాదు.

రాణి : నా గురించి కాదా ? మరెవరి గురించి. అంటే మీకు వేరే ఇంకొకటి వుందన్నమాట. ఎవత్తది ! ? ఎక్కడుంది.

శంక : ప్రస్తుతం నా దగ్గరుంది.

రాణి : ఆ మీదగ్గరే వుందా ? ఓరిదేవుడో ! ఇంతకి తెగించారా మీరు నిజం చెప్పండి. నా మీద ఒట్టేసి నిజం చెప్పండి.

శంక : నా దగ్గరున్న మాట నిజం. కాని అసలు నా దగ్గరకి ఎలా వచ్చింది ఎక్కడెక్కడ తిరిగింది. ఎన్ని చేతులు మారింది. తెలీదు. నీకు చెప్పలేదు. చెబితే నీవు నా అనుమానం నిజం అయింది అంటావు. అలాగని దాన్ని వదిలించుకోలేను.

రాణి : వదిలించుకోవ్ ! వుంచుకుందామనా ! మాట్లాడరేవండీ !

శంక : వుంచుకునే వుద్దేశ్యం లేదు. కాని రాణీ. నువ్వు సహకరిస్తే తప్ప దాన్ని వదిలించుకోలేను. నా మాట నమ్ము. దగ్గరకి రా రాణి ! నేనీకు ఎపుడూ అన్యాయం చెయ్యలేదు రాణీ. నామాట నమ్ము.

రాణి : ఏవండీ

( వచ్చి గుండెలపై ఏడుస్తూ వాలిపోయింది )

శంక : చాలు రాణీ ఈ మాత్రం కోపరేషన్ చాలు. దాన్ని ఎడం చేత్తో వదిలించుకుంటా. నా నిజాయితీని రుజువు చేసుకుంటా ( ఆమె జాకెట్‌లోకి రింగ్ వేసాడు) అంతే రాణి ! ఇంతకన్నా ఎక్కువ వాగటం దండగ థాంక్యూ ప్రాణం హాయిగా వుంది.

రాణి : ప్రాణం హాయిగా వుందా ? పైగా థాంక్యూనా ?

( రాణికి అనుమానం వచ్చి జాకెట్లో చూసుకుంది. విషయం అర్థమైంది )

ఇదేమిటి ? ఇక్కడ...అంటే మీరు ఇందాకటి నుంచి వదిలించుకోవాలనుకుంటుంది దీని గురించా....

శంక : దేనిగురించి....స్పష్టంగా చెప్పు...

రాణి : అబ్బే... ఏం లేదు...నే చెప్పను....ఏం లేదు....

( లోనికి పరిగెత్తింది )

----- తెర -----